సంపుటి :02 సంచిక :2014 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 21, అక్టోబర్ 2025

## తిప్పిరి తిరుపతే అభయ్

మావోయిస్టు పార్టీలో పరిణామాలపై జాతీయ మీడియాలో కథనాలు

02





హైదరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి దీపక్ ర్యాలీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

# ముగిసిన కీలక ఘట్టం

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం ముగింపు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియలో మంగళ వారం కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో పోటాపోటీగా అభ్యర్థులు తమ నామినేషన్ ప్రతాలను దాఖలు చేశారు. షేక్ పేట తహసీల్దారు కార్యాలయం (ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్)లోకి మధ్యాహ్నం 3 గంటల వరకు గేటు లోపల ఉన్న అభ్యర్థులను మాత్రమే అధికారులు నామినేషన్ దాఖలుకు అనుమతించారు. మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆగిన నామినేషన్ల పర్వంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు పెద్ద సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. సుమారు వందకు పైగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు సమాచారం. స్వతంత్ర అభ్యర్థులతో పాటు పలువురు రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులు, ఓయూ విద్యార్థులు, నిరుద్యోగ సంఘాల నాయకులూ నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. దాఖలైన నామినేషన్లను ఆర్వో సాయిరాం ఆధ్వర్యంలో బుధవారం నుంచి అధికారులు పరిశీలించనున్నారు. అభ్యర్థులకు ఈనెల 24 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ జరగనుంది.

—అక్షరదర్బార్, హైదరాబాద్

02

- సుమారు 150 మందికిపైగా దాఖలు
- స్వతంత్రులతో పాటు ఆర్ఆర్ఆర్ బాధితులూ..
- 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు
- చివరి రోజు నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి
- ఎన్నికలు త్రిముఖ పోరు.. గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీల ఎత్తుగడలు




# మావోయిస్టులు అజ్ఞాతం వీడాలి

02

- జన జీవన స్రవంతిలో కలిసి రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకోవాలి
- శాంతిభద్రతల రక్షణలో టాప్ తెలంగాణ పోలీస్‌శాఖ
- ప్రాణాలను అడ్డు పెట్టి ప్రజల రక్షణ
- పోలీస్ అమర వీరుల దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి





## పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు

04



## సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

03

# తిప్పిరి తిరుపతే అభయ్

- **మావోయిస్టు పార్టీలో పరిణామాలపై జాతీయ మీడియాలో కథనాలు**

అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ కీలకనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను, ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవ రావు సహా ఇతర ముఖ్య నాయకులు లొంగిపోయిన వేళ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయంటూ జాతీయ మీడియాలో వరుసగా కథనాలు ప్రసారమవుతున్నాయి. ఏప్రిల్‌లో పార్టీ చీఫ్, సుప్రీం కమాండర్ బసవరాజు అలియాస్ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ అనంతరం పార్టీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ పార్టీని భుజాన వేసుకున్నట్టు తెలిపాయి. మావోయిస్టు పార్టీలో 'అభయ్'గా కూడా ఆయనే వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నాయి. అయితే అంతకుముందు మల్లోజుల వేణుగోపాల్ 'అభయ్' పేరిట పార్టీ లేఖలు విడుదల చేసేవారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



కాగా పార్టీ నేతల లొంగుబాటు తర్వాత ఇప్పటివరకు అభయ్ పేరుతో రెండు పత్రికా ప్రకటనలు విడుదలయ్యాయి. ఒకటి మల్లోజులతో సహా లోగిపోయిన సభ్యుల చర్యను ఖండిస్తూ అక్టోబర్ 24న దేశవ్యాప్త బంద్ కు పిలుపునిస్తూ ప్రకటించారు.


# వికసిత్ భారత్ ముసుగులో కార్పొరేట్ హిందూ ఫాసిజం

**- మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్**

**- 24న భారత్ బంద్ కు పిలుపు**

అక్షరదర్బార్, హైదరాబాద్: కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధం పేరుతో విప్లవోద్యమాన్ని అణచివేయడానికి కుట్రలు చేస్తున్నాయని, ఈ అణచివేతకు వ్యతిరేకంగా ఈనెల 18 నుంచి 23 వరకు దేశవ్యాప్తంగా నిరసన వారాన్ని పాటించాలని, 24న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని నెలలుగా కగార్ యుద్ధం పేరుతో పార్టీ నేతలపై, కార్యకర్తలపై ప్రభుత్వాలు "ఎన్‌కౌంటర్" దాడులు చేస్తున్నాయని, ఇవి వాస్తవానికి హత్యలేనని ఆయన ఆరోపించారు. 'అర్బన్ నక్సల్స్' పేరుతో ప్రజాపక్ష శక్తులను, రచయితలను, సామాజిక కార్యకర్తలను టార్గెట్ చేస్తోంది. ఇది అత్యంత ఫాసిస్టు వ్యూహం. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుతో ప్రతిపక్ష రహిత భారత్ (విపక్ష్ ముక్త్ భారత్) దిశగా బీజేపీ సాగుతోంది. రాజ్యాంగాన్ని మార్చి ఆధునిక మనుస్మృతిని దేశ చట్టంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది` అని పేర్కొన్నారు.






# ముగిసిన కీలక ఘట్టం

- **జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం ముగింపు**
- **సుమారు 150 మందికిపైగా దాఖలు**
- **స్వతంత్రులతో పాటు ఆర్ఆర్ఆర్ బాధితులూ..**
- **24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు**
- **చివరి రోజు నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి**
- **ఎన్నికలు త్రిముఖ పోరు.. గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీల ఎత్తుగడలు**

అక్షరదర్బార్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియలో మంగళవారం కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో పోటాపోటీగా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. షేక్‌పేట తహసీల్దారు కార్యాలయం (ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్)లోకి మధ్యాహ్నం 3 గంటల వరకు గేటు లోపల ఉన్న అభ్యర్థులను మాత్రమే అధికారులు నామినేషన్ దాఖలుకు అనుమతించారు. మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆగిన నామినేషన్ల పర్వంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు పెద్ద సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. సుమారు వందకు పైగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు సమాచారం. స్వతంత్ర అభ్యర్థులతో పాటు పలువురు రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులు, ఓయూ విద్యార్థులు, నిరుద్యోగ సంఘాల నాయకులూ నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. దాఖలైన నామినేషన్లను ఆర్వో సాయిరాం ఆధ్వర్యంలో బుధవారం నుంచి అధికారులు పరిశీలించనున్నారు. అభ్యర్థులకు ఈనెల 24 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ జరగనుంది

## - ముగ్గురు పరిశీలకులు

ఉప ఎన్నికల పర్యవేక్షణకు ఎన్నికల సంఘం ముగ్గురు పరిశీలకులను నియమించింది. సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులుగా ఐపీఎస్ ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్ లాల్ నియమితులయ్యారు. వీరు ఎన్నికలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. ఎన్నికల నిబంధనల అమలు, శాంతి భద్రతలు, ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ వంటి అంశాలను దగ్గరగా పర్యవేక్షిస్తారు. ఎన్నిక పూర్తి అయ్యేవరకూ వీరు అందుబాటులో ఉంటారు. ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన లు,శాంతి భద్రతలు, వ్యయాలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే పార్టీల ప్రతినిధులు, పౌరులు పరిశీలకులకు తెలియజేయవచ్చు.

## - త్రిముఖ పోరు..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అధికార పార్టీ కాంగ్రెస్ సహా బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత గోపీనాథ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో నిలిచారు. దీంతో ఇక్కడ త్రిముఖ పోరు అనివార్యమైంది. ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో పార్టీలు పక్కా ప్రణాళికలు రచిస్తున్నాయి.

## - బీజేపీ అభ్యర్థి నామినేషన్

బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి చివరిరోజు మంగళవారం నామినేషన్ వేశారు. బీజేపీ అధిష్ఠానం ఆయనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయన నామినేషన్ వేశారు. తొలుత ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి  ఇదే నియోజకవర్గంలోని వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. దీపక్ రెడ్డి గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి 25 వేలకు పైగా ఓట్లు సాధించారు కానీ, ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. తాము గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షిస్తుంటే బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని నేరుగా లోపలికి అనుమతించడంపై కొందరు స్వతంత్ర అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటర్నింగ్ ఆఫీసు ఎదుట వారు ఆందోళనకు దిగారు. తాము ఉదయం నుంచి లైన్‌లో వేచిచూస్తుంటే అప్పుడే వచ్చిన దీపక్ రెడ్డిని ఎలా అనుమతిస్తారని అధికారులను నిలదీశారు.





# మావోయిస్టులు అజ్ఞాతం వీడాలి

- **జన జీవన స్రవంతిలో కలిసి రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకోవాలి**
- **శాంతిభద్రతల రక్షణలో టాప్ తెలంగాణ పోలీస్‌శాఖ**
- **ప్రాణాలను అడ్డు పెట్టి ప్రజల రక్షణ**
- **పోలీస్ అమర వీరుల దినోత్సవంలో సీఎం రేవంత్**

అక్షరదర్బార్, హైదరాబాద్: ఇప్పటివరకు లొంగిపోయిన మావోయిస్టులే కాకుండా, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముఖ్యమంత్రి మాట్లాడారు. మావోయిస్టు కార్యకలాపాల కట్టడిలో పోలీసుల పనితీరు మరువలేనిదన్నారు. మిగిలిన మావోయిస్టులు సైతం లొంగిపోయి రాష్ట్ర అభివృద్ధిలో తమవంతు తోడ్పాటు అందించాలని కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సాంకేతికతతో నేరాలను అదుపు చేయడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే బెస్ట్‌గా నిలిచిందని, దేశంలోనే అగ్రగామిగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. తీవ్రవాదం, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు రాష్ట్రంలో పెరగకుండా అదుపు చేయడంలో పోలీసుల కృషి అద్భుతంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా, సైబర్ నేరాలు, డిజిటల్ నేరాలు పెద్ద సవాల్‌గా మారుతున్నాయని, వాటి నిర్మూలనలో తెలంగాణ పోలీసుల కృషిని యావత్ దేశం అభినందిస్తుందని వ్యాఖ్యానించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశామని, డ్రగ్స్ రహిత తెలంగాణే తమ ధ్యేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం పోలీసుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తుందని, పోలీసు నియామకాలకు పెద్ద పీఠ వేస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా బెనిఫిట్స్ అందిస్తున్నామని, ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచి ఆదుకుంటున్నామని సీఎం వివరించారు. నిజామాబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్య కోసం రంగారెడ్డి జిల్లా మంచి రేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ‘సాస్కి’ అమలుకు ప్రతిపాదనలు చేయండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి సమావేశం

అక్షరదర్బార్, వరంగల్: సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ) పథకం అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సాస్కి ప్రతిపాదనల రూపకల్పనపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సాస్కి ప్రతిపాదనలను నవంబర్ 30లోగా అధికారులు పథకానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకొని వ్యూహాత్మక ప్రణాళికతో స్థలాలను గుర్తించి, తగిన డాక్యుమెంటేషన్‌తో అన్ని అంశాలను క్రోడీకరించి ప్రతిపాదనలు



రూపొందించాలని అన్నారు. సాస్కి పథకంలో భాగంగా చారిత్రాత్మక నేపథ్యం కలిగిన నగరంలో పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలని, నైబర్ హుడ్ ప్రణాళిక అంశంలో పాదచారులు నడిచే మార్గాలను అభివృద్ధి చేయడం, మౌలిక వసతులను కల్పించడం, ప్రజలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టడంతో పాటు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్ లను అభివృద్ధి చేయడం, స్పాంజ్ సిటీ కాన్సెప్ట్ లో భాగంగా నగరంలో స్పాంజ్ పార్క్ ఏర్పాటు చేయడం, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించడం, సిటీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో 50 ఎకరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నగరంలోగల చారిత్రాత్మక (పురాతన) బావులను పునరుద్ధరించే అంశాలను పొందుపరచాలని ఈ సందర్భంగా మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈ శివానంద్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.





## భూపాలపల్లి మున్సిపాలిటీని
# ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు
- రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. పట్టణాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.50 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో జరగగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ.. భూపాలపల్లిని ఆధునిక మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఈ నిధులతో పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, పట్టణ సౌందర్యం వంటి అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. జయశంకర్, అంబేద్కర్, ఆర్టీసీ బస్టాండ్, హనుమాన్ జంక్షన్ల విస్తరణతో పాటు అమృత్‌సర్ స్కీమ్‌లో రూ.23 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. అదనంగా, అంబేద్కర్ భవనానికి రూ.5 కోట్లు, గిరిజన భవనానికి రూ.1 కోటి కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

**పోలీసుల సేవలు చిరస్మరణీయం**

దేశ భద్రత, ప్రజారక్షణకై పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పోలీస్ కార్యాలయంలో జరిగిన అమరవీరుల దినోత్సవం కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయన పాల్గొన్నారు. పోలీసుల నిబద్ధతతోనే ప్రజలు భయరహితంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అమరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించి, అమరవీరుల కుటుంబాలకు బహుమతులు అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, అటవీశాఖ అధికారి, అమరవీరుల కుటుంబాలు పాల్గొన్నారు.

# సిటిజన్ సర్వేలో పాల్గొనాలి



అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణ రైజింగ్ – 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకు ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ – 2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ సర్వేను చేపట్టిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈ నెల 25తో ముగుస్తుందని, www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి జిల్లా ప్రజలు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ కోరారు.

# రియాజ్ ఎన్ కౌంటర్ హర్షనీయం



అక్షర దర్బార్, కేసముద్రం : కానిస్టేబుల్ ను హతమార్చిన రియాజ్ ను ఎన్ కౌంటర్ చేయడం హర్షనీయమని శోభన్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిజామాబాద్ లో కానిస్టేబుల్ పై రియాజ్ కత్తితో దాడి చేయగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రియాజ్ ను ఎన్ కౌంటర్ చేయడంపై యావత్తు ప్రజానీకం హర్షం వ్యకం చేస్తోందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మంచి నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.

# 26న రైతు సదస్సు

**- మెగా హెల్త్ క్యాంపు కూడా..**

అక్షరదర్బార్, హనుమకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు హనుమకొండ హంటర్ రోడ్డులోని పుస్కూరి మోహన్ రావు ప్రాంగణంలోని వెలమ భవన్ లో రైతు సదస్సు ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, నీటి సంరక్షణ పద్ధతులు, వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, నాబార్డ్ ద్వారా పెట్టుబడులు, ఆల్టర్నేట్ ఫార్మింగ్, పాడి పరిశ్రమ, గవర్నమెంట్ స్కీమ్స్ తదితర అంశాలపై ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని సదస్సులో రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి వ్యవసాయం చేస్తున్న వెలమ రైతులు, రైతు కుటుంబాలు రైతు సదస్సుకు హాజరుకావాలని కోరారు. ఈ రైతు సదస్సులో భాగంగా మెగా హెల్త్ క్యాంపు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ గచ్చిబౌలి కిమ్స్ హాస్పిటల్ కు చెందిన అన్ని విభాగాల వైద్యుల బృందంతో జరిగే మెగా హెల్త్ క్యాంపులో వెలమ రైతులు పాల్గొని రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వెంకటేశ్వర్ రావు కోరారు.

# వట్టివాగును తోడేస్తున్నారు..

- నంబర్ ప్లేట్లు లేకుండా ఇసుక అక్రమ రవాణా..
- అడ్డుకునే వారు లేక బరితెగింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మండలంలో ఇసుక మాఫియా రోజురోజుకు చెలరేగిపోతుంది. రాత్రి, పగలు తేడా లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది.అడ్డూ అదుపు లేకుండా ఇసుక మాఫియా రాజ్యమేలుతుంది. వర్షాలు తగ్గాయో లేదో కానీ ఇసుక తోడేళ్లు వట్టివాగును తోడేస్తున్నారు.మండలంలో ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుంది. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు నిద్ర మత్తులో తూగుతున్నారనడానికి నిదర్శనం వట్టి వాగులో కనిపిస్తున్న ట్రాక్టర్ లే ప్రత్యక్ష సాక్ష్యం. మంగళవారం పట్టపగలే వెంకటగిరి గ్రామ శివారులోని వట్టివాగు పాత చెక్ డ్యాం వద్ద పదికి పైగానే ట్రాక్టర్ లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నింపుకోవడానికి వచ్చాయి.ఈ ట్రాకర్ లు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపురం, లక్ష్మి



నగర్, బ్రహ్మంగారి గుడి తండా,బడితండాకు చెందినవి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇతర నిర్మాణాల వంటివి మండలంలో ఇటీవలే బాగా జరుగుతున్నాయి. దాన్ని ఆసరాగా చేసుకున్నా ఇసుక బకాసురులు, ఇసుక దొకరకడం లేదంటూ ట్రిప్పుకు 6 వేల నుంచి 7500 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఈ ఇసుక సురులు సిండికేట్గా మారి తాము ఆడిందే ఆట పాడిందే పాటగా ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్నారు.ఇసుకను తరలించే ట్రాక్టర్ల కు నంబర్ ప్లేట్లను తొలగించి జోరుగా వ్యాపారం చేస్తున్నారు. ఇసుక వ్యాపారం చేసే ట్రాక్టర్లను ఏ అధికారి గుర్తించకుండా ఉండేందుకు నంబర్ ప్లేట్లను తొలగించి మేము సిద్దమంటున్నారు. ఇక ఇసుక నింపుకొని రోడ్డు ఎక్కిందంటే ఏ ట్రాక్టర్ ఎవరికీ దొరకదు. ఎవరి కంట పడకుండా చేరాల్సిన ప్రదేశానికి అతి వేగంతో చేరుతుంటాయి.ఇటీవల అతివేగంగా ఇసుక వాహనాలు నడవడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇసుక ట్రాక్టర్లను నడిపే వాహనదారులకు లైసెన్సులు ఉండవు. ఏదైనా ప్రమాదం సంభవించిన ఈజీగా తప్పించుకుంటున్నారు. అడపా దడపా అధికారులు తనిఖీ చేసి వాహనాలను పట్టుకుంటే అధికార పార్టీకి చెందిన నాయకులు కాల్ చేసి అవి మా ట్రాక్టర్లే వదిలేయండి అని చెప్పడంతో ఆ ఇసుక ట్రాక్టర్లు మళ్లీ రోడ్డెక్కుతున్నాయి. ఇసుక వ్యాపారాన్ని నిర్మూలించేదెవరు..?అక్రమ ఇసుక రవాణాను అరికట్టేది ఎవరు..? అని మండల ప్రజలు ప్రశ్నలను సంధిస్తున్నారు.ఏది ఏమైనా ఇంత తతంగం జరుగుతున్న సంబంధిత అధికారులు తమ కేమి పట్టనట్లుగా మొద్దనిద్రలో తూగుతున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు... మరి ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటారా... లేదా అనేది వేచి చూడాల్సిందే మరి...



# మేకల కాపరిపై అడవి దున్న దాడి

- అక్కడికక్కడే మృతి
- కొత్తగూడ మండలం కార్లాయి గ్రామంలో ఘటన

అక్షర దర్బార్, కొత్తగూడ : అడవి దున్న దాడితో.. మేకల కాపరి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండలంలోని కార్లాయి గ్రామానికి చెందిన మేకల కాపరి కల్తి గోవింద్(50) గోవింద్ ఈనెల 18న మేకలు కాయడానికి సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజుల తర్వాత గ్రామస్తులు గాలింపు జరపగా, అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. శవం పక్కనే అడవి దున్న పిల్ల మృతదేహం కూడా కనిపించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చనిపోయిన అడవి దున్న దూడ నోటి వద్ద నురగ ఉండటంతో పాము కాటుకు మృతి చెందినట్లు ఊహిస్తున్నారు. ఈ క్రమంలో చనిపోయిన దూడను చూసేందుకు వచ్చిన గోవింద్‌పై కోపంతో అడవి దున్న దాడి చేసి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న కొత్తగూడ ఎస్సై ఇమ్మడి రాజ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మాదకద్రవ్య రహిత జిల్లాగా భూపాలపల్లి

## "మిషన్ పరివర్తన్"తో అవగాహన

భూపాలపల్లి, అక్టోబర్ 21 (అక్షర దర్బార్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పరిపాలన కృషి ముమ్మరం చేసింది. కాటారం మండల మేడిపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "మిషన్ పరివర్తన్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ప్రసాద్ మాట్లాడుతూ, "మాదక ద్రవ్యాల వినియోగం యువతను నాశనం చేస్తోందని, ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై సమాజ మార్పు కోసం ముందుకు రావాలని" పిలుపునిచ్చారు. విభాగ సిబ్బంది విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. మాదకద్రవ్యాల సమాచారం కోసం 100, 14446, 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళ సాధికారత సిబ్బంది అనూష "బేటీ బచావో – బేటీ పడావో" కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, మహిళా శాఖ అధికారులు పాల్గొని "మనం మారుదాం, సమాజాన్ని మార్చుదాం" అనే ప్రతిజ్ఞ చేశారు.



# లక్కీ డ్రా పేరిట మోసం..




- ప్లాట్ పేరుతో లక్షల రూపాయల దందా!
- పరకాలలో కొత్త మాయాజాలం..

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి లక్కీ డ్రా పేరిట భారీ మోసానికి తెరలేపాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజీపేట ప్రాంతంలో 205 చ. గజాల ప్లాట్‌ను విక్రయించేందుకు ఆయన వినూత్న పంథాను అవలంబించాడు.

### 1600 టోకెన్లు.. ఒక్కొక్కటి రూ.2999

ప్లాట్‌ను లక్కీ డ్రా ద్వారా గెలుచుకునే అవకాశమంటూ మొత్తం 1600 టోకెన్లను విడుదల చేశాడు. ఒక్క టోకెన్‌ను రూ.2999కు విక్రయిస్తూ, వాటికి మొత్తం రూ.47.98 లక్షలు వసూలు చేసే స్కీం నడిపిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

### "భారీ బహుమతులు" పేరుతో మోసం?

ఈ లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా 295 చ.గజాల ప్లాట్, ఇతర బహుమతులుగా ఐఫోన్స్, ఎల్ఈడీ టీవీలు వంటివి ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇందులో ఎంతమంది నిజంగా బహుమతులు గెలుచుకుంటారు? ఎవరికి బహుమతులు లభిస్తాయనే ప్రశ్నలు ప్రజల్లో కలకలం రేపుతున్నాయి.

### ప్రజల్లో ఆందోళన

ఈ వ్యవహారంపై పరకాల పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక మోసపూరిత పథకమై ప్రజలను గాల్లో కోటలు కట్టించేందుకు, డబ్బులు దోచుకునేందుకు చేసే ప్రయత్నమని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇటువంటి స్కీములకు చెక్ పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, ఈ లక్కీ డ్రా వ్యాపారంలో నిబంధనల ఉల్లంఘన ఉందా? లబ్ధిదారులకు ఎలాంటి హామీలు ఇవ్వబడ్డాయి? అనే అంశాలపై లోతుగా విచారణ జరిపి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు."



# పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అక్షరదర్బార్, హనుమకొండ: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 191మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా సత్య శారద , స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎన్ సీసీ గ్రూప్ కమాండర్ కర్నల్ సచిన్ అన్నారావు, కర్నల్ రవి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, ప్రభాకర్ రావు, శ్రీనివాస్, బాలస్వామి, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావుతో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారధ్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శస్త్ర్' చేశారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సేవకోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు మహనీయులని అన్నారు. వారి త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే ఉంటారని అన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి మిషన్ హాస్పిటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేలు, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దీపావళి వేడుకల్లో నాయిని

అక్షరదర్బార్, హనుమకొండ: వెలుగుల పండుగ దీపావళి వేడుకలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, అభిమానులు, నగర ప్రజలకు ఎమ్మెల్యే దంపతులు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



# విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

## గీతాంజలి స్కూల్స్ డైరెక్టర్ కోనకంచి రామకృష్ణ

అక్షర దర్బార్,మహబూబాబాద్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ వారిని అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం గీతాంజలి విద్యాసంస్థల ప్రధాన ధ్యేయమని గీతాంజలి స్కూల్స్ డైరెక్టర్ కోనకంచి రామకృష్ణ అన్నారు. భారత వికాస్ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలోని చంద్రశేఖర్ ఆడిటోరియంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమూహ గీతాల పోటీ–2025లో గీతాంజలి విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ రామకృష్ణ సన్మానించి అభినందించి మాట్లాడారు. పోటీల్లో హిందీ,



సంస్కృతం, ప్రాంతీయ భాషలు, జానపద గీతాలపై విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. గీతాంజలి హైస్కూల్ మహబూబాబాద్ శాఖకు చెందిన 8 మంది విద్యార్థులు ఫ్రంట్ లెవల్ కాంపిటీషన్‌లో బహుమతులు సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత ప్రియాంక సర్కార్, గైడ్ టీచర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## దుగ్గొండి కేజీబీవీలో కుక్ పోస్టులకు

# దరఖాస్తుల ఆహ్వానం

## ఈ నెల 25 దరఖాస్తులకు చివరి రోజు

అక్షర దర్బార్, దుగ్గొండ : దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో ఖాళీగా ఉన్న కుక్ పోస్టులకు అర్హులైన మహిళల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగిన స్థానిక మహిళలు, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత కలిగిన దుగ్గొండి మండల మహిళలు అర్హులు. అభ్యర్థులు 18 నుండి 45 సంవత్సరాల వయస్సు ఉండాలని చెప్పారు. సామూహిక వంటలో అనుభవం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దరఖాస్తుతో పాటు విద్యా సర్టిఫికెట్లు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, వంట అనుభవ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫొటోలు జతచేయాలి. దరఖాస్తులు ఈ నెల 25న సాయంత్రం 4 గంటలలోపు మల్లంపల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారికి స్వయంగా అందజేయాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు సూచించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915